నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 7 ఆగస్టు 2024 | KHAMMAM

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు
- రూ.34.67 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఖమ్మం, ఆగస్టు 6 : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఆరోపించారు. తన సిఫారసు మేరకు మంజూరైన సీఎం సహాయ నిధి రూ.34,67,000 విలువైన 106 చెక్కులను నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ విషయంలో లబ్ధిదారులకు పూర్తి సహాయం అందిందని, నేటి ప్రభుత్వం అనారోగ్యంతో బాధపడుతున్న వారి విషయంలో కూడా కోతలు విధిస్తూ వివక్ష చూపుతోందన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తాత్సారం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్పర్సన్ మరికంటి ధనలక్ష్మి, జడ్పీటీసీలు పొట్ల శ్రీను కవిత, వరప్రసాద్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్, రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, చామకూరి రాజు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు

ప్రజా సమస్యలపై పనిచేయడానికి..
పదవే గీటురాయి కాదు

- గడిచిన ఐదేళ్లలో ఖమ్మం జడ్పీలో అర్థవంతమైన చర్చలు
- పాలకమండలి వీడ్కోలు సభలో ఎమ్మెల్సీ తాతా మధు
- పదవున్నా లేకున్నా ప్రజాసేవకే అంకితం: కమల్‌రాజు
- పాలకవర్గాన్ని సన్మానించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

పాలకవర్గ సభ్యులతో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మామిళ్లగూడెం, ఆగస్టు 6:ప్రజా సమస్యలపై పనిచేయడానికి పదవి మాత్రమే గీటురాయి కాదని ఎమ్మెల్సీ తాతా మధు పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్లలో ఖమ్మం జిల్లా పరిషత్‌లో అర్థవంతమైన చర్చలు జరిగాయని గుర్తుచేశారు. ఖమ్మంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ సాధారణ సమావేశంతోపాటు పాలకమండలి వీడ్కోలు సభను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తాతా మధు మాట్లాడుతూ.. ఈ ఐదేళ్లకాలంలో చైర్మన్‌తోపాటు పాలకవర్గ సభ్యులు జిల్లా అభివృద్ధికి విశేష కృషిచేశారని గుర్తుచేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యలను తెలుసుకొని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి పాటుపడ్డారని జ్ఞప్తికి తెచ్చారు.

ప్రజా సేవకే అంకితం:కమల్‌రాజు

రాజకీయాల్లో పదవులు వస్తూపోతూ ఉంటాయని జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పేర్కొన్నారు. అయితే తమకు పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవకే అంకితమవుతున్నామని అన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమంతోపాటు జిల్లా అభివృద్ధికి అవసరమైన సేవలను అందించామని, ఇక ముందు కూడా అందిస్తామని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లా అభివృద్ధి కోసం తన వంతు బాధ్యతగా పనిచేశానని వివరించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: చైర్మన్

ముందుగా జడ్పీ చివరి సాధారణ సమావేశంలో భాగంగా ప్రజారోగ్యం, పశువుల ఆరోగ్య స్థితిపై చర్చించారు. జడ్పీ సీఈవో వినోద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ.. సీజన్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ సీజన్ కొనసాగుతున్నందున పశువులకు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా, ఐదేళ్లపాటు పాలకవర్గానికి సహకారం అందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాలకవర్గానికి సన్మానం

ఐదేళ్లపాటు జడ్పీ పాలకవర్గానికి చైర్మన్‌గా సేవలందించిన చైర్మన్ లింగాల కమల్‌రాజు దంపతులను ఎమ్మెల్సీ తాతా మధు, జడ్పీ సీఈవో వినోద్, డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు సన్మానించారు. అనంతరం జడ్పీటీసీలను, మాజీ ఎంపీపీలను జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, జడ్పీ సీఈవో వినోద్ సన్మానించారు. జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ పట్టాలెక్కేనా?

- కొత్తగూడెంలో ఎన్నికల కోడ్‌తో ఆగిన ప్రక్రియ
- సర్వే దగ్గరే నిలిచిపోయిన దరఖాస్తులు
- పట్టాల కోసం ఎదురు చూస్తున్న ఇంటి యజమానులు

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 6 : కొత్తగూడెం పట్టణంలో ఇంటి యజమానులు దశాబ్దకాలంగా ఎదుర్కొంటున్న ఉన్న ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ సమస్యకు గత కేసీఆర్ ప్రభుత్వం పరిష్కారం చూపింది. మున్సిపాలిటీ పరిధిలో ఇంటి యజమానులు నిర్మించుకున్న ఇళ్లకు, ఇళ్ల స్థలాలకు ఎలాంటి అధికారిక ధ్రువపత్రాలు ఎవరి వద్దా లేవు. కేవలం ఇంటి నెంబర్లపైనే ఆధారపడి క్రయవిక్రయాలు చేసుకున్నారు. దీనివల్ల ఆస్తులకు అధికారికంగా గుర్తింపు లేకపోవడంతోపాటు బ్యాంకు రుణాలు కూడా లభించే పరిస్థితి లేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా గత కేసీఆర్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు వినతి మేరకు సీఎం కేసీఆర్ జీవో 76 ద్వారా ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారు. మొత్తం మూడు విడతలుగా ఈ జీవోను విడుదల చేసి సాధారణ ఫీజు చెల్లించే విధంగా ఇంటి క్రమబద్ధీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. తొలుత 2014, జూన్ 2వ తేదీ వరకు, ఆ తర్వాత 2020, జూన్ 2వ తేదీ వరకు నిర్మించుకున్న ఇంటికి పట్టాలు అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానించారు.

ఎన్నికల కోడ్‌తో ఆగిన ప్రక్రియ

అక్టోబర్‌లో శాసనసభ ఎన్నికల కోడ్ రావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఇక ఆ తర్వాత ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. అయినప్పటికీ ఈ అంశంపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఇక మరోసారి మార్చిలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో పట్టాల పంపిణీ ప్రక్రియ అటకెక్కింది. సుమారు తొమ్మిది నెలలుగా ఇంటి క్రమబద్ధీకరణ పట్టాల సర్వే, పంపిణీ ప్రక్రియపై ప్రభుత్వం కిమ్మనకుండా ఉండడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

సర్వే దగ్గరే నిలిచిపోయిన దరఖాస్తులు

తొలివిడతలో సుమారు 7 వేల దరఖాస్తులు రాగా.. 4,700 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలను పంపిణీ చేశారు. రెండో విడతలో సుమారు 1,500లకుపైగా దరఖాస్తులు రాగా.. 400లకుపైగా లబ్ధిదారులకు ఇంటి పట్టాలను గత మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అందించారు. ఇక మూడో విడత 2,200 దరఖాస్తులు వచ్చాయి. సుమారు 100కు పైగా దరఖాస్తును సర్వే పూర్తి చేశారు. మిగిలిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పట్టాలను అందించాలని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రక్రియను వేగవంతం చేసింది. కానీ.. శాసనసభ ఎన్నికల కోడ్ అమలుల్లోకి రావడంతో ఈ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. ఎన్నో ఏళ్ల నుంచి ఇంటి క్రమబద్ధీకరణ పట్టాల కోసం ఎదురుచూస్తున్న వారికల సాకారం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేయాలని ఇంటి యజమానులు కోరుతున్నారు.


లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు(ఫైల్)

ప్రభుత్వ ఆదేశాలు రాగానే ప్రక్రియ చేపడుతాం..

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రమబద్ధీకరణ పట్టాల సర్వేను నిలిపివేశాం. మళ్లీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వస్తే వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే చేపడుతాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత దరఖాస్తులను సర్వే చేసి అర్హులను గుర్తించి క్రమబద్ధీకరణ పట్టాలను అందిస్తాం.

– డి.పుల్లయ్య, కొత్తగూడెం తహసీల్దార్

జాతీయ రహదారుల నిర్మాణాలు
గడువులోగా పూర్తి చేయాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఆగస్టు 6 : జాతీయ రహదారుల నిర్మాణాలను గడువులోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందనతో ఉమ్మడి ఖమ్మంజిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణాల మంజూరు, ప్రగతిపై హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో సమీక్షించారు. హైదరాబాద్ –విజయవాడ జాతీయ రహదారిపై ఖమ్మం నుంచి సూర్యాపేట ఎంట్రీ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు సత్వరమే ప్రారంభించాలని, ఖమ్మం– దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల ప్రగతి, ఖమ్మం– దేవరపల్లి ధంసలాపురం వద్ద ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్ల కోసం అయ్యే భూసేకరణ ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని, దానికి అనుగుణంగా ఎన్‌హెచ్ఏఐకి లేఖ రాయాలని అన్నారు. ధంసలాపురం ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్‌ల నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే వెంబడి కలెక్టరేట్ వరకు సర్వీస్ రోడ్లలను కూడా పూర్తి చేసినట్లయితే ఖమ్మంలో ట్రాఫిక్ నియంత్రణకు మరింత సహకరిస్తుందని తెలిపారు, సర్వీస్ రోడ్లను సత్వరమే మంజూరు చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఖమ్మం– కురవి రోడ్డు, ఖమ్మం– కోదాడ రోడ్డు పురోగతిపై సమీక్ష చేశారు. నెహ్రూనగర్– కొత్తగూడెం జాతీయ రహదారి, టెండర్ల దశలో ఉందని, టెండర్ పూర్తికాగానే వాటి నిర్మాణపనులు మొదలు పెడతామని హరిచందన తెలిపారు. చిల్లకల్లు (హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారి) క్రాస్‌రోడ్డు నుంచి బోనకల్లు, వైరా, తల్లాడ నుంచి కొత్తగూడం వరకు జాతీయ రహదారి మంజూరు కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించామని, త్వరలోనే మంజూరు అవుతుందని మంత్రి తుమ్మల తెలిపారు.

రోడ్లు, భవనాలశాఖ ప్రత్యేక కార్యదర్శితో సమావేశమైన మంత్రి తుమ్మల

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఎంపీ వద్దిరాజు నివాళి

ఖమ్మం, ఆగస్టు 6 : తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలో మంగళవారం ఎంపీ రవిచంద్ర, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదర్‌రావు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ దాసోజు శ్రావణ్ తదితరులతో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలుచల్లి ఘనంగా నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్

మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ నామా

ఖమ్మం, ఆగస్టు 6 : తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తికి విశేషంగా కృషి చేసిన మహనీయుడు, రాష్ట్ర ప్రజలు కలకాలం గుర్తుంచుకునే వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్షనేత, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నామా మాట్లాడుతూ రాష్ట్ర సాధనే ఆశగా, శ్వాసగా జీవించారని, జీవితమంతా ప్రజా శ్రేయస్సు, తెలంగాణ ఉద్యమానికే ధారపోసిన ఆయన ఆశయం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ చూపిన బాటలోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాభివృద్ధికి అడుగులు వేసి పదేళ్ల కాలంలో అన్ని రంగాలను ఎంతగానో తీర్చిదిద్దారన్నారు. ఆయన పేరును ఒక జిల్లాకు, ఒక విశ్వవిద్యాలయానికి పెట్టారని, తెలంగాణ జన హృదయాల్లో సదా నిలిచి ఉంటారని నామా పేర్కొన్నారు.

జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- భద్రాద్రి, ఖమ్మం కలెక్టర్లు

జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ) : ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాల సాధన కోసం అందరం కృషి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జయశంకర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో జయశంకర్ పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సీపీవో శ్రీనివాసరావు, ఎస్సీ సంక్షేమాధికారి అనసూయ, బీసీ సంక్షేమాధికారి ఇందిర, ఉద్యాన అధికారి సూర్యనారాయణ, జిల్లా పరిపాలనాధికారి గన్యా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మంలో..

మామిళ్లగూడెం, ఆగస్టు 6 : ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా జయశంకర్ నిలిచారని అన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, డీఆర్‌వో రాజేశ్వరి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టండి

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, ఆగస్టు 6 : అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో మండల స్థాయి ప్రజావాణి, బుధవారం పాఠశాల భోజనం, కలెక్టరేట్‌లో సౌకర్యాల కల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనలో ప్రతి స్థాయిలో బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ఇక నుంచి ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు, సమయం, డబ్బు వృథా కాకుండా తహసీల్దార్ కార్యాలయంలో అర్జీల స్వీకరణ చేస్తున్నట్లు తెలిపారు. గత సోమవారం మండల స్థాయిలో నిర్వహించిన ప్రజావాణిలో 536 అర్జీలు వచ్చాయని, వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 363 వరకు ఉన్నాయని తెలిపారు. జిల్లా అధికారులు తమ తమ శాఖల పరిధిలో వచ్చిన అర్జీలను పరిశీలించి శుక్రవారం వరకు పరిష్కరించాలని ఆదేశించారు. శుక్రవారం ఉదయం పరిష్కారం అయినవి, కానివి పరిశీలించి తిరస్కరణ క్వాలిటీగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి బుధవారం పాఠశాల భోజన కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులు పాఠశాలలను సందర్శించి సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్ గేట్ వద్ద నిర్మిస్తున్న బస్ షెల్టర్‌ను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో మందులతో కూడిన డిస్పెన్సరీని, ఉమెన్ బ్రిస్ట్ ఫీడింగ్ రూం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, డీఆర్‌వో రాజేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంసిద్ధత సర్వే షురూ..

విద్యార్థులతో ఎన్సీఈఆర్టీ ప్రొఫెసర్ పూజా పటేల్, ఏఎంవో రవికుమార్

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 6 : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న విద్యాప్రవేశ్ నిర్వహణను పరిశీలించేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేలో భాగంగా ఎన్సీఈఆర్టీ న్యూఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ పూజా పటేల్ మంగళవారం నగరంలోని ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా పాఠశాలలో తరగతి గది నిర్వహణ, విద్యార్థుల ప్రగతి, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాల నిర్వహణలో హెచ్ఎంల పాత్ర, మధ్యాహ్న భోజన పథకం, ఆరోగ్యం–పరిశుభ్రత, క్రీడాంశాలు, మైదానం, పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం తదితర అంశాలను సూచికలుగా తీసుకొని సర్వే చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి కేశవపట్నం రవికుమార్, ఎంఈవో ఎం.శ్రీనివాస్, పరిశీలకులు జీవన్, రవి, శ్యామ్, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలేరుకు చేరిన సాగర్ జలాలు

- వానకాలం పంటల కోసం విడుదల
- క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం

ఎడమ కాలువ ద్వారా పాలేరుకు చేరిన సాగర్ జలాలు

కూసుమంచి, ఆగస్టు 6:వానకాలం సీజన్‌లో నాగార్జునసాగర్ ఆయకట్టుకు సాగునీటిని అందించాలనే నిర్ణయంలో సాగర్ డ్యాం నుంచి శుక్రవారం విడుదలైన కృష్ణా జలాలు సోమవారం రాత్రి పాలేరుకు చేరుకున్నాయి. దీంతో రిజర్వాయర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. నాగార్జునసాగర్ కింద పాలేరు రిజర్వాయర్ పరిధిలో 2.5 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. గత యాసంగికి నీరు లేకపోవడంతో పూర్తిగా పంటలు వేయకుండా ఉన్న రైతులు.. ఈసారి నీరు పుష్కలంగా ఉండడంతో పంటల సాగుకు సన్నద్ధమయ్యారు. ఈసారి వానకాలం, యాసంగి సీజన్లకు పూర్తి స్థాయిలో నీటిని ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం సాగర్ నుంచి 2,160 క్యూసెక్కుల నీరు పాలేరుకు వచ్చి చేరుతోంది. పాలేరు పాత కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భక్తరామదాసు ఎత్తిపోతల పథకానికి 275 క్యూసెక్కుల నీటిని, మిషన్ భగీరథకు 135 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో.. ఒకటి, రెండు రోజుల్లో సుమారు 4 వేల వరకు వచ్చే అవకాశం ఉన్నందున పాలేరు నీటిమట్టం క్రమంగా పెరగనుంది.

వర్షాలతో నీటి విడుదల ఆలస్యం

పాలేరు రిజర్వాయర్ కింది ఎడమ కాలువ రెండో జోన్‌కు నీటిని విడుదల చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కొద్ది రోజులు ఆలస్యంగా నీటిని వదలాలని అధికారులు నిర్ణయించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జిల్లాకు చెందిన సాగర్ ఆయకట్టు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఈ వారంలో నీటిని విడుదల చేయించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పాత కాలువకు 320 క్యూసెక్కుల నీరు

నేలకొండపల్లి, కూసుమంచి మండలాల రైతులకు సాగునీరు అందించే పాలేరు పాత కాలువ ప్రవాహాన్ని అధికారులు మంగళవారం 320 క్యూసెక్కులకు పెంచారు. దీని ఆయకట్టు కింది రైతులు ఈ నీటిని సద్వినియోగం చేసుకోవాలని ఈఈ మంగలపుడి వెంకటేశ్వర్లు, డీఈ రత్నకుమారి కోరారు. ఈ మేరకు వారు మంగళవారం పాలేరు నుంచి నేలకొండపల్లి చివరి తూము వరకు ఈ కాలువను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అర్హులకు రుణమాఫీ వర్తింపజేయాలి

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- సొసైటీలో రూ.3.50 కోట్లు మొదటి విడత రుణమాఫీ

చుంచుపల్లి, ఆగస్టు 6 : అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం సొసైటీలో మొదటి విడత రుణమాఫీ అయిన రూ.3.50 కోట్ల చెక్కులను డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావుతో కలిసి మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు విడతల్లో రుణమాఫీ పథకం కింద నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రుణమాఫీ అయిన రైతులకు తిరిగి పంట రుణాలు ఇస్తారని, ఈ అవకాశాన్ని సహకార సంఘాల్లో రుణమాఫీ అయిన రైతులు సద్వినియోగం చేసుకొని తమ పంటలకు పెట్టుబడి పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కాసాని ఐలయ్య, సంఘం ఉపాధ్యక్షుడు కూచిపూడి జగన్నాథరావు, బ్యాంకు మేనేజర్ శాంతి రాగమయి, నాగ సీతారాములు, డైరెక్టర్లు పాల్గొన్నారు.